సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 8 । జూలై । 2024



సీతాఫలాలు వచ్చేశాయి 8లో

సీతాఫలాల సీజన్ ప్రారంభమైంది. పాడేరు ఘాట్‌లోని వంట్లమామిడి, 12వమైలురాయి జంక్షన్ వద్ద అమ్మకాలు జరుగుతున్నాయి.



నేటి నుంచి ఇసుక విక్రయాలు

జిల్లాలోని ఎటపాక మండలంలో ఆనెల 8 నుంచి ఇసుక విక్రయాలు పారంభిస్తున్నట్టు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. 8లో



ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

విశాఖ: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం హరేకృష్ణ హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

దుండగుల ఆచూకీ చెబితే రూ.10 వేల బహుమతి

వీఆర్‌పురం: మండలంలోని శ్రీరామగిరి రామాలయంలో స్వామివారి పల్లకి వాహనాలను అపహరించిన దుండగుల ఆచూకీ తెలియజేస్తే రూ.10 వేల నగదు బహుమతి పోలీసుశాఖ తరఫున అందజేస్తామని ఎస్‌ఐ కె.నాగరాజు తెలిపారు.గత నెల 27వతేదీన శ్రీరామగిరి కొండ పై గల సుందర సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామివారి ఉత్సవ ఊరేగింపులో వినియోగించే అశ్వ, గరుడ, ఆంజనేయ వాహనాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించడం తెలిసిందే. వారి ఆచూకీ తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. వారి సమాచారం తెలిసినవారు 9490617848,9490617851 నంబర్లకు తెలియజేయాలని ఆయన కోరారు.

108లో సుఖ ప్రసవం



శిశువును అప్పగిస్తున్న 108 వాహన సిబ్బంది

కొయ్యూరు/అడ్డతీగల: పురిటినొప్పులతో బాధపడుతున్న నిండు గర్భిణిని 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో ప్రసవించింది. కొయ్యూరు మండలం టీటో రాళ్ల గ్రామానికి చెందిన కిల్లో అంజలి (34) ఆదివారం ఉదయం పురిటి నొప్పులతో బాధపడుతోంది. వెంటనే బంధువులు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. ఈ మేరకు అదే వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మండలంలోని సీతారం గ్రామం వద్దకు వచ్చేసరికి ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, వారిని యూ.చీడిపాలెం పీహెచ్‌సీకి తరలించామని 108 ఈఎంటీ అశోక్‌కుమార్, పైలెట్ నవాజ్ తెలిపారు.

సంప్రదాయం వైపే మొగ్గు

- రాగుల సాగులో మంచి ఫలితాలు
- రైతు స్థాయిలో విత్తనోత్పత్తి
- సొంతంగా సమకూర్చుకుంటున్న రైతులు
- ప్రభుత్వం 90 రాయితీపై సరఫరా చేసినా ఆసక్తి కరువు
- 141 క్వింటాళ్లలో 20 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు
- శుభ పరిణామమంటున్న వ్యవసాయశాఖ
- చైతన్యం నింపిన గత ప్రభుత్వం

జిల్లాలో రాగి పంటను సాగు చేసే రైతులు విత్తన సమస్యను అధిగమించారు. గణనీయమైన పురోగతి సాధించారు. ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాలపై ఆధారపడకుండా సాగు అవసరాలకు తగ్గట్టుగా వారే సమకూర్చుకుని ప్రభుత్వ ఆశయాన్ని నెరవేరుస్తున్నారు.సాటి రైతులకు మార్గదర్శకంగా నిలుస్తున్నారు.



నారు సేకరణలో గిరిజన మహిళలు



రాగుల నాట్లలో నిమగ్నమైన కూలీలు

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో ఆదివాసీ రైతులు పూర్వం నుంచి సాగు చేసే చిరుధాన్యాల పంటల్లో రాగులు ఒకటి. మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నందున సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. ఏటా సుమారు 16,373 హెక్టార్ల విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. గత మూడేళ్ల క్రితం వరకు సాగుకు అవసరమైన విత్తనాలకోసం పూర్తిగా వ్యవసాయశాఖపై ఆధారపడేవారు. కొన్ని సందర్భాల్లో విత్తనాల కోసం ఇబ్బందులు పడిన పరిస్థితులు ఉన్నాయి. అలాంటి సమయంలో విత్తనోత్పత్తి ద్వారా సమస్య అధిగమించవచ్చని రైతులు గమనించారు. అందుకు తగ్గట్టుగా వారిలో చైతన్యం నింపేందుకు గత ప్రభుత్వం నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు దోహదపడ్డాయి. ఇప్పుడు వ్యవసాయశాఖపై ఆధారపడకుండా వారే సాగుకు అవసరమైన విత్తనాలను సిద్ధంగా చేసుకుని నారుమడులు తయారు చేసుకున్నారు. గతంలో ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతానికి అనువైన చైతన్య, వేగవతి, సింహాద్రి రకాల విత్తనాలను సరఫరా చేసింది. మంచి దిగుబడులు రావడంతో అప్పటినుంచి ఈ రకాలను మాత్రమే సాగు చేస్తున్నారు. ఏటా దిగుబడి సమయంలో కొంతమేర విత్తనాల కోసం కేటాయిస్తున్నారు. ఇలా సొంతంగా విత్తనం సమకూర్చుకోవడం వల్ల ప్రభుత్వం పంపిణీ చేసే విత్తనాల కోసం ఎదురుచూపులు తప్పాయి. ఈ ఏడాది కూడా వారు భద్రపరచుకున్న చైతన్య, వేగవతి, సింహాద్రి రకాలతో నారుమడులు తయారు చేసుకున్నారు. ఈ రకాలు 110 రోజుల్లో దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారవర్గాలు తెలిపాయి.

రాయితీ విత్తనాలపై ఆసక్తి కరువు

జిల్లాలో రాగుల సాగు విస్తీర్ణానికి తగ్గట్టుగా గత ప్రభుత్వం ప్రస్తుత సీజన్‌కు సంబంధించి వేగవతి, శ్రీచైతన్య రకాలకు చెందిన 141 క్వింటాళ్ల విత్తనాలను ముందుగానే సిద్ధం చేసింది. అయితే రైతులు వీటిపై ఆసక్తి చూపలేదు. ఇప్పటివరకు కేవలం 20 క్వింటాళ్ల విత్తనాలను మాత్రమే రైతు భరోసా కేంద్రాల నుంచి తీసుకువెళ్లారని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. మిగతా రైతులంతా భద్రపరచుకున్న విత్తనాలను వినియోగించుకున్నారు. గత ప్రభుత్వం రైతులకు 90 శాతం రాయితీతో విత్తనాలు ఇవ్వడంతోపాటు పంట దిగుబడి వచ్చిన తరువాత గిట్టుబాటు ధరకు 181 టన్నుల రాగులను కొనుగోలు చేసింది. కిలోకు రూ.38.40 చొప్పున ధర చెల్లించింది. వారి ఖాతాల్లో వెంటనే నగదు జమ చేసింది. దీని వల్ల మార్కెటింగ్ సమస్య పరిష్కారమైంది.

గుళి రాగి సాగు విధానంపై మొగ్గు

గుళి రాగి సాగు విధానంపై ఇప్పుడిప్పుడే రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ విధానంలో సాగు చేయడం వల్ల పిలకశాతం పెరుగుతుంది. అందుకు తగ్గట్టుగా వెన్నుల సంఖ్య పెరిగి గణనీయంగా దిగుబడి వస్తుంది. ఎకరా విస్తీర్ణంలో సాగుకు అర కిలో విత్తనం సరిపోతోంది. అదే పాత విధానంలో సాగు చేసేందుకు ఎనిమిది కిలోల విత్తనం అవసరం. దీనివల్ల రైతు స్థాయిలో పెట్టుబడి వ్యయం పెరుగుతుంది.

రసాయన ఎరువులకు దూరం

సాధారణంగా ఏజెన్సీలో రైతులు రసాయన ఎరువులు, క్రిమి సంహార మందుల వినియోగానికి దూరంగా ఉంటారు. ప్రకృతి సాగు విధానాన్ని అలవర్చుకున్న వీరు ఆవుపేడ, మూత్రంతోనే ఎరువులు, కషాయం తయారు చేసి వినియోగిస్తున్నారు.దీనివల్ల సాగుకు పెట్టుబడి వ్యయం తగ్గింది. ఆరోగ్యకరమైన దిగుబడులు వస్తున్నాయి. మార్కెట్లో కూడా గిట్టుబాటు ధర లభిస్తోంది. పిలకలు ఎక్కువగా రావడంతో దిగుబడి కూడా గణనీయంగా పెరిగిందని గిరి రైతులు తెలిపారు. ఎకరానికి ఆరు నుంచి ఎనిమిది క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వారు చెబుతున్నారు. ఏజెన్సీలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున రైతులు నాట్లు వేయడంలో నిమగ్నమయ్యారు.

నాణ్యతలో నంబర్‌వన్



గిరిజనులు సాగుచేస్తున్న రాగుల పంట నాణ్యతలో నంబరు వన్‌గా గుర్తింపు పొందింది. ప్రకృతి విధానంలో సాగు చేయడం వల్ల మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ఆర్‌బీకేల్లో 90 శాతం రాయితీపై విత్తనాలను సిద్ధంగా ఉంచాం. అయితే రైతులు వారు సొంతంగా సిద్ధం చేసుకున్న విత్తనాలను వినియోగిస్తున్నారు. దీనివల్ల 141 క్వింటాళ్లలో 20 క్వింటాళ్లు మాత్రమే అమ్ముడయ్యాయి. రైతులు సొంతంగా మేలుజాతి విత్తనాలను సమకూర్చుకుని సాగు చేయడం మంచి పరిణామం.

– ఎస్‌బీఎస్ నందు, జిల్లా వ్యవసాయాధికారి, పాడేరు

మహానేత జ్ఞాపకాలు పదిలం

- నాడు వైఎస్సార్ నాటిన మొక్క నేడు వృక్షమై..
- అపురూపంగా చూసుకుంటున్న పాడేరు వాసులు



రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం తన రెండు కళ్లుగా భావించి పాలన అందించిన దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జ్ఞాపకాలు ఇప్పటికీ మన్యంలో పదిలంగానే ఉన్నాయి. జిల్లా కేంద్రమైన పాడేరు పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో 2009 జూలై 12న ఆయన నాటిన కదంబం మొక్క నేడు వృక్షంగా ఎదుగుతోంది. ముఖ్యమంత్రి హోదాలో పాడేరు విచ్చేసిన ఆయన గిరిజనులతో నిర్వహించిన సదస్సులో పాల్గొన్నారు. అటవీభూములకు పట్టాల పంపిణీ అనంతరం ఈ మొక్కను నాటారు. ఆయన జ్ఞాపకంగా ఈ చెట్టును అటవీశాఖ, పాలిటెక్నిక్ కళాశాల ఉద్యోగులు సంరక్షిస్తున్నారు. నాటి జ్ఞాపకాన్ని పాడేరు వాసులు నేడు అపురూపంగా చూసుకుంటున్నారు. – సాక్షి, పాడేరు

కార్యకర్తలకు అండగా ఉంటాం



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి



ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను సత్కరిస్తున్న రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి

- ఎవరూ అధైర్యపడొద్దు.. భవిష్యత్ మనదే
- వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి

కొమ్మాది (విశాఖ) : వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై అమానుషంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వ చర్యలను ఎండగట్టడంతోపాటు ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని ఆ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం ఎండాడలో గల జిల్లా పార్టీ కార్యాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీటీసీలు, ఎంపీటీసీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా డా.బి.ఆర్.అంబేడ్కర్, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న దాడులను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిక్షణం తెలుసుకుంటున్నారని తెలిపారు. నాయకులంతా కార్యకర్తలకు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. రాబోయే రోజుల్లో మళ్లీ మనం అధికారంలోకి వస్తామని, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, డిప్యూటీ కోఆర్డినేటర్ తిప్పల నాగిరెడ్డి, పార్టీ అనకాపల్లి, అల్లూరి జిల్లాల అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, భాగ్యలక్ష్మి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంభా రవిబాబు, మాజీ ఎమ్మెల్యేలు కంబాల జోగులు, పెట్ల ఉమాశంకర్ గణేష్, అన్నంరెడ్డి అదీప్‌రాజు, చింతలపూడి వెంకటరామయ్య, సమన్వయకర్తలు మీసాల భరత్, అనురాధ, జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు, సత్యవతి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

వైఎస్సార్ జయంతిని వాడవాడలా నిర్వహించండి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను వాడవాడలా ఘనంగా నిర్వహించాలని, అదేవిధంగా సేవా కార్యక్రమాలు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని పార్టీ శ్రేణులకు రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు.

కార్యకర్తకు బాసటగా..

టీడీపీ గుండాల దాడిలో గాయపడిన జీవీఎంసీ 9వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ఉమ్మిడి అప్పారావుకు పార్టీ బాసటగా నిలిచింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.50 వేల చెక్కును రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఉమ్మిడి దాసు, కార్పొరేటర్ స్వాతి దాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం

సార్వత్రిక ఎన్నికల్లో అరకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో విజయం సాధించిన మత్స్య లింగంను రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి సత్కరించారు.

నేడు వైఎస్ జయంతికి ఏర్పాట్లు పూర్తి

- వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాలి
- ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పిలుపు

సాక్షి,పాడేరు: దివంగత సీఎం, మహానేత డాక్టర్ వైఎస్సార్ జయంతిని సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి, అరకు, పాడేరు ఎమ్మెల్యేలు రేగం మత్స్యలింగం, మత్స్యరాస విశ్వేశ్వరరాజు తమ నియోజకవర్గాల పరిధిలో జరిగే జయంతి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు అన్ని మండలాల్లో సేవా కార్యాక్రమాలు నిర్వహించడమే కాకుండా వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి కోరారు.

జిల్లాకేంద్రం పాడేరులో..

జిల్లా కేంద్రం పాడేరు పాత బస్టాండ్‌లో సోమవారం ఉదయం మహానేత డాక్టర్ వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహిస్తామని పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు క్యాంపు కార్యాలయ సిబ్బంది ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు మహానేత విగ్రహానికి ఆయన పాలాభిషేకం చేసి పూలమాలలతో నివాళులు అర్పిస్తారని తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల పార్టీ అధ్యక్షుడు, పార్టీ శ్రేణులు, జిల్లా నేతలు తప్పనిసరిగా హాజరుకావాలని వారు కోరారు.ఈ కార్యక్రమ అనంతరం పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని సిబ్బంది తెలిపారు.

అరకులోయ టౌన్: మహానేత వైఎస్ జయంతి వేడుకలను నియోజకవర్గంలో గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అరకులోయలో నిర్వహించే వేడుకలకు మండలంలోని ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు. ఉదయం 11 గంటలకు అరకులోయలోని వైఎస్ విగ్రహం వద్దకు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని ఆయన కోరారు.

పాపికొండల సందర్శనకు భారీగా పర్యాటకులు

మూడు బోట్లలో 175 మంది..

దేవిపట్నం: పాపికొండల అందాలను వీక్షించేందుకు ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివెళ్లారు. పలు ప్రాంతాల నుంచి ముందుగా ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకున్న పర్యాటకులు పోశమ్మగండికి చేరుకున్నారు. మూడు పర్యాటక బోట్‌లు ద్వారా 175 మంది పర్యాటకులు పేరంటపల్లి వెళ్లి, సందర్శన అనంతరం తిరిగి వచ్చారు.

పోటెత్తిన భక్తులు

గండిపోశమ్మ తల్లి దర్శనానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన సుమారు ఆరువేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. దర్శనం టికెట్ల విక్రయం ద్వారా రూ.27,375ల ఆదాయం సమకూరినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు.

క్లుప్తంగా

సీతాఫలాలు వచ్చేశాయి

- పాడేరు ఘాట్‌రోడ్లో అమ్మకాలు ప్రారంభం
- బుట్ట రూ.150 నుంచి రూ.200కు విక్రయం

సాక్షి,పాడేరు: సీతాఫలాల సీజన్ ప్రారంభమైంది. పాడేరు ఘాట్‌లోని వంట్లమామిడి, 12వమైలురాయి జంక్షన్ వద్ద గిరిజన రైతులు అమ్మకాలను ప్రారంభించారు. పక్వానికి వచ్చిన 10 పండ్ల బుట్టను సైజును బట్టి రూ.150 నుంచి రూ.200కు విక్రయిస్తున్నారు. స్థానికులతో పాటు ఈ ప్రాంతానికి వచ్చే సందర్శకులు కొనుగోలు చేస్తున్నారు. పాడేరు మండలంలోని వంట్లమామిడి, సలుగు, దేవాపురం, మినుములూరు, మోదాపల్లి, వనుగుపల్లి, జి.మాడుగుల మండలం వంతాల, సొలబం పంచాయతీల పరిధిలో వేలాది ఎకరాల్లో సీతాఫలం తోటలు ఉన్నాయి. ఏటా జూలై నుంచి నవంబర్ వరకు మన్యంలో సీతాఫలాల సీజన్ ఉంటుంది. గిరిజనులకు మంచి ఆదాయం ఇచ్చే వాటిలో సీతాఫలాలు ఒకటి.

జెన్‌కో స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు

సీలేరు: ఏపీ జెన్‌కో స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శిగా జలవిద్యుత్కేంద్రంలో ఏడీఈగా పనిచేస్తున్న కె.శ్రీనివాసరావును స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యులు ఎన్నుకున్నారు. ఆదివారం ఏపీ జెన్‌కో ఎస్ఈ కార్యాలయంలో ఎస్ఈ కేకేవీ ప్రశాంత్‌కుమార్ అధ్యక్షతన సీలేరు స్పోర్ట్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. గతంలో స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఎం.లక్ష్మీనారాయణ బదిలీ కావడంతో ఆ స్థానంలో ఇక్కడ ఏడీఈగా పనిచేస్తున్న కె.శ్రీనివాసరావును ఎన్నుకున్నారు.

పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

దేవిపట్నం: గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో పోశమ్మ గండి వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఈ కారణంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా టూరిజం బోటింగ్ పాయింట్, స్నాన ఘట్టాలు వద్ద పహారా ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ నాగార్జున తెలిపారు.

నేటి నుంచి ఇంజినీరింగు వెబ్ ఆప్షన్లు

మురళీనగర్(విశాఖ): ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌లో భాగంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ఆదివారం ముగిశాయి. వెబ్ ఆప్షన్లను సోమవారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు ఎంపిక చేసుకోవాలని కంచరపాలెం ప్రభుత్వపాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ కె.నారాయణరావు తెలిపారు. 13న వెబ్ ఆప్షన్లు మార్చుకోవచ్చు. ఈనెల 16న సీట్లు కేటాయింపు, 17 నుంచి 22వ తేదీ వరకు సెల్ఫ్ జాయినింగ్ రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఈనెల 19వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

ఘనంగా జగన్నాథుని రథయాత్ర

భారీగా తరలివచ్చిన భక్తజనం

ముంచంగిపుట్టు: మండలంలోని కొండపడ, ధారెల గ్రామాల్లో మంగళవారం జగన్నాథ స్వామి రథయాత్రను ఘనంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. థింసా నృత్యాలు చేస్తూ డప్పు,వాయిద్యాలతో భక్తులు సందడి చేశారు. వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆయా గ్రామాల ఆలయ కమిటీల సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. భక్తులకు ప్రసాదాలు పంచి పెట్టారు.దీంతో పాటు ఏవోబీ సరిహద్దు ప్రాంతమైన ఒనకఢిల్లీ, పాడువ గ్రామాల్లో రథయాత్రను సరిహద్దు గ్రామాల గిరిజనులు ఘనంగా నిర్వహించారు.



కొండపడలో జగన్నాథస్వామి రథయాత్రలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

చిత్రకొండలో రథయాత్రకు..

సీలేరు: ఇక్కడికి సమీపంలోని చిత్రకొండలో ఆదివారం జరిగిన జగన్నాథస్వామి రథయాత్రకు సీలేరు నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివెళ్లారు.

17న సత్యనారాయణస్వామి సామూహిక వ్రతాలు

- పాడేరు మోదకొండమ్మ ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో ఈనెల 17వతేదీన సత్యనారాయణస్వామి సాముహిక వ్రతాల నిర్వహణకు బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం పాడేరు శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రచార పోస్టర్‌ను ఆదివారం మోదకొండమ్మ ఆలయం వద్ద ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, మోదకొండమ్మతల్లి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, ఆధ్యాత్మిక కమిటీ ప్రతినిధులు ముకుందు, రత్నం, కారం దేముడు, కొండలరావు, బ్రహ్మకుమారీలు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 108 దంపతులతో అత్యంత వైభవంగా సత్యనారాయణస్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆసక్తి గల భక్తులు ఈనెల 15లోగా జిల్లా ప్రభుత్వాస్పత్రి వెనుక ఉన్న ఈశ్వరీయ విద్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 8688653949, 8500629064 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మోదకొండమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు, బ్రహ్మకుమారీలు

స్వగ్రామంలో పాడేరు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం



కిల్లంకోటలో ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును దుశ్శాలువాతో సన్మానిస్తున్న సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు



కిల్లంకోటలో గిరిజన యువతతో ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు


జి.మాడుగుల: సార్వత్రిక ఎన్నికల్లో పాడేరు నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా విజయ సాధించి, మొదటి సారిగా స్వగ్రామైన మండలంలోని కిల్లంకోట పంచాయతీకి ఆదివారం వచ్చిన మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు అపూర్వ స్వాగతం లభించింది.మండల కేంద్రానికి అతి మారుమూలన సుమారు 70కిలోమీటర్ల దూరంలో ఉన్న కిల్లంకోట నుంచి ప్రథమంగా ఎమ్మెల్యేగా విశ్వేశ్వరరాజు ఎన్నికయ్యారు. మొదటి సారిగా గ్రామానికి వచ్చిన ఆయనకు గ్రామస్తులు, పలు మండలాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు దుశ్శాలువాలు కప్పి, పూల దండలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సత్యనారాయణ, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నుర్మని మత్స్యకొండంనాయుడు, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, ఐసరం హనుమంతరావు,లసంగి మాలన్న, కొండబాబు, మాజీ ఎంపీటీసీలు బ్రహ్మలింగం, రాము, మాజీ సర్పంచ్ టి.రాంబాబు, మండల నాయకులు కె.సత్యనారాయణ, శేఖర్, పండన్న తదితరులు పాల్గొన్నారు.

మీ బిల్లును మీరే లెక్కించుకోవచ్చు

- ఈస్టర్న్ పవర్ యాప్‌లో మరిన్ని ఫీచర్లు జోడింపు
- విద్యుత్ వినియోగం కూడా తెలుసుకునే వెసులుబాటు
- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

సాక్షి, విశాఖపట్నం: విద్యుత్ బిల్లుల చెల్లింపుల కోసం ఏపీఈపీడీసీఎల్ కొత్తగా ప్రవేశపెట్టిన 'ఈస్టర్న్ పవర్'మొబైల్ యాప్‌లో సరికొత్త ఫీచర్లు జత చేసినట్లు ఆ సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఈ మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని వినియోగదారుడి 16 అంకెల సర్వీస్ నంబర్ నమోదు చేసుకోవడం ద్వారా మొబైల్ యాప్ సేవలను పొందవచ్చన్నారు. ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్‌లో 'బిల్ పే'ఆప్షన్ ద్వారా విద్యుత్ బిల్లులను ఎలాంటి అదనపు రుసుం లేకుండా సులభతరంగా చెల్లించుకోవచ్చని తెలిపారు. వినియోగదారుడి సర్వీసుకు సంబంధించిన విద్యుత్ వినియోగం, బిల్లు వివరాలు, బిల్లు చెల్లింపు, విద్యుత్ సరఫరా పరిస్థితి వివరాలు తెలుసుకునేలా సరికొత్త ఫీచర్లు తీసుకొచ్చామని వివరించారు. 'మై యూసేజ్' ఆప్షన్ ద్వారా ప్రస్తుత వినియోగపు యూనిట్ల సంఖ్యను నమోదు చేయడం ద్వారా విద్యుత్ బిల్లును లెక్కించుకోవచ్చన్నారు.

యాప్ ద్వారా ఆధార్ నంబర్‌కు విద్యుత్ సర్వీసును అనుసంధానం చేసుకోవడంతోపాటు విద్యుత్ సంబంధిత సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు.



యూపీఐ యాప్‌ల ద్వారా బిల్లులు నేరుగా చెల్లించే విషయమై ఆర్బీఐ అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ.. పాత విధానంలోనే నేరుగా ఫోన్ పే, పేటీఎం, గూగుల్ పే ద్వారా బిల్లులు చెల్లించేందుకు వీలుగా బ్యాంకులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. ఈపీడీసీఎల్ వెబ్‌సైట్ నుంచి కూడా బిల్లులు చెల్లించుకునే సౌకర్యం ఉందన్నారు. మొబైల్ యాప్‌లో గానీ వెబ్‌సైట్‌లో గానీ బిల్లులు చెల్లించేటప్పుడు వినియోగదారులు తమ యూపీఐ యాప్‌లతో పాటు నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్, వాలెట్స్, క్యాష్ కార్డులు కూడా వాడుకోవచ్చని సీఎండీ పృథ్వీతేజ్ స్పష్టం చేశారు.

వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం-2గా పవన్‌కుమార్

తాటిచెట్లపాలెం(విశాఖ): ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్-2గా 2016 బ్యాచ్ ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్‌కు చెందిన అధికారి కె.పవన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. పవన్ కుమార్ నైపర్, మొహాలిలో ఎం.ఫార్మ్, ఎంఎ పూర్తి చేశారు. హుబ్లి డివిజన్, సౌత్ వెస్టన్ రైల్వే, ఫ్రైట్ ఆపరేషన్స్ విభాగంలో ఏరియా ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించారు. ఈయన సేవలకు గాను పలు అవార్డులు లభించాయి. ఇప్పటివరకు వాల్తేర్ డివిజన్‌లో డివిజనల్ కమర్షియల్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎ.అవినాష్ సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ (జనరల్)గా పదోన్నతి పొందారు.



పవన్‌కుమార్

నేటి నుంచి ఇసుక విక్రయాలు

- టన్నుకు రూ.300 ధర నిర్ణయం
- కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: ఈనెల 8వతేదీ సోమవారం నుంచి జిల్లాలోని ఎటపాక మండలంలో ఇసుక విక్రయాలు ప్రారంభిస్తున్నామని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే మండలంలోని గుండాల-1, గుండాల-2 డిపోల్లో 1,66,826 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ప్రభుత్వ ఆదేశాలు, మైన్స్ అండ్ జియాలజీ కమిషనర్ సూచనల మేరకు జిల్లా స్థాయి కమిటీలో చర్చించి ధరపై నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా అత్యంత పారదర్శకంగా గిరిజన సంఘాల ద్వారా ఇసుక అమ్మకాలు జరుపుతామన్నారు. గుండాల-1 డిపోలో 87,800 టన్నులు, గుండాల 2 డిపోలో 79.026 టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. మెట్రిక్ టన్నుకు రూ.300 చెల్లించి ఇసుకను పొందవచ్చన్నారు. ఇసుక కొనుగోలు చేసిన వినియోగదారుల సౌకర్యార్థం రవాణా చార్జీలు మెట్రిక్ టన్నుకు కిలోమీటర్‌కు రూ.5 ధర నిర్ణయించామని ఆయన పేర్కొన్నారు.

ఇసుక నిల్వల పరిశీలన

ఎటపాక: ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సోమవారం నుంచి మండలంలోని గుండాల గ్రామంలో తక్కువ ధరకు ఇసుక ప్రజలకు అందుబాటులో ఉంటుందని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య తెలిపారు. ఆదివారం గుండాల గ్రామంలో జాతీయ రహదారి పక్కన ఉన్న రెండు ఇసుక నిల్వలను ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు ప్రతిమ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉన్న ఇసుక నిల్వలను ఆదివారం స్థానిక తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

లయన్స్‌పై కింగ్స్ విజయం



అర్ధసెంచరీ చేసిన ప్రశాంత్



విజయం సాధించిన కింగ్స్

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్ టీ-20లో భాగంగా ఆదివారం జరిగిన తొలి మ్యాచ్‌లో రాయలసీమ కింగ్స్ ఆరు వికెట్ల తేడాతో ఉత్తరాంధ్ర లయన్స్‌పై విజయం సాధించింది. పీఎం పాలెంలోని వైఎస్సార్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రాయలసీమ కింగ్స్‌పై టాస్ గెలిచిన ఉత్తరాంధ్ర లయన్స్ బ్యాటింగ్‌కు దిగింది. ఇన్నింగ్స్ చివరి బంతికి 121 పరుగులు చేసి ఆలౌటైంది. ఓపెనర్లు కెప్టెన్ గుల్ఫామ్(4), తరుణ్(1) వికెట్లను ఐదు పరుగులకే లయన్స్ కోల్పోయింది. తపస్వి(20), రాహుల్(20) కాస్త నిలకడగా రాణించారు. వీరిద్దరూ జట్టు స్కోర్ 46 పరుగుల వద్దే పెవిలియన్‌కు చేరారు. ధీరజ్(11), తేజస్వి(12), పృథ్వీ(12) రవికిరణ్(13) రెండంకెల స్కోర్ చేయగలిగారు. గిరినాథ్, రఫీ, కుమార్ రెండేసి వికెట్లు తీశారు. ప్రతిగా బ్యాటింగ్ చేసిన కింగ్స్ ఓపెనర్ హనీష్ రెడ్డి(5) ఎనిమిది పరుగుల స్కోర్ వద్ద పెవిలియన్‌కు చేరాడు. అతని స్థానంలో వచ్చిన రోషన్(8) 29 పరుగుల వద్ద రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. ఓపెనర్ ప్రశాంత్ నిలకడగా ఆడుతూ(51, 36 బంతుల్లోనే ఆరు ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధసెంచరీ చేశాడు. ఈ క్రమంలో బౌలర్ శ్రీనివాస్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరుకున్నాడు. వంశీకృష్ణ(20) 99 పరుగుల వద్ద నాలుగో వికెట్‌గా వెనుదిరిగాడు. రోహిత్(26), కెప్టెన్ గిరినాథ్(9) జోడీ అజేయంగా నిలిచి జట్టుకు విజయాన్నందించింది. దీంతో 17.3 ఓవర్లలో రాయలసీమ కింగ్స్ విజయలక్ష్యాన్నందుకున్నారు. లయన్స్ బౌలర్ శ్రీనివాస్ రెండు వికెట్లు తీశాడు.

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది. అప్పన్నను దర్శించుకోవడానికి భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. మరో వైపు సింహాచలేశుడికి ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం ఏడుగంటల నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయకల్యాణమండపంలో వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

10న అంగన్‌వాడీ సిబ్బంది ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

అనకాపల్లి: ఈ నెల 10న డిమాండ్స్ డే సందర్భంగా అంగన్‌వాడీల సమస్యలపై జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంతోపాటు మండల కేంద్రాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఉద్యోగుల సమ్మెకాలంలో ఇచ్చిన హామీల జీవోలు తక్షణమే అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కోత పెడుతుందన్నారు. ఈ నిధులను పెంచాలని, ఐదేళ్లలోపు బాల బాలికలను ప్రైవేట్ స్కూల్లో చేర్చకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా జీవోలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి, కోశాధికారి వి.వి.రమణమ్మ, నాయకులు కె.తనూజ, జయలక్ష్మి, రమణి, సత్యవేణి పాల్గొన్నారు.

అనకాపల్లి నూకాంబిక ఆలయానికి భక్తుల తాకిడి



నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయానికి ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి పిల్లాపాపలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణ పరిధిలో కొంతమంది భక్తులు తమ గృహాల వద్ద శనివారం రాత్రంతా అమ్మవారి పాట నిర్వహించి, కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. అక్కడ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వంటలు చేసుకుని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వృద్ధులు, గర్భిణుల కోసం అమ్మవారి దర్శనానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

66/99జూన్‌లో ఛేదించిన కేసులివీ..

- మొత్తం 80 కేసులను ఛేదించి.. రూ.37,12,715 సొత్తు స్వాధీనం
- నేరాల నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలి
- విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

అల్లిపురం(విశాఖ): నగర ప్రజలు పోలీసులకు సహకరించి.. నేరాల నియంత్రణతో భాగస్వాములు కావాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పిలుపునిచ్చారు. నగర పోలీస్ కమిషనరేట్‌లోని సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన జూన్ రికవరీ మేళాలో ఆయన మాట్లాడారు. జూన్‌లో 99 దొంగతనాలు జరిగాయని, సుమారు రూ.78,60,266 విలువ గల సొత్తు చోరీకి గురైందన్నారు. బాధితుల ఫిర్యాదుల మేరకు జాయింట్ పోలీస్ కమిషనర్ కె.ఫకీరప్ప, క్రైం డీసీపీ వెంకటరత్నం ఆధ్వర్యంలో క్రైం సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి 80 కేసులను ఛేదించారని వెల్లడించారు. ఈ కేసుల్లో 69 మంది నిందితులను అరెస్ట్ చేసి.. వీరి వద్ద నుంచి రూ.37,12,715 విలువ గల సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. పోలీసులు ఛేదించిన 80 కేసుల్లో 66 జూన్‌లో జరిగినవి కాగా.. మిగిలినవి పాత కేసులన్నారు. ఒక దోపిడీ, మూడు పగటిపూట, 17 రాత్రి పూట ఇంటి దొంగతనం కేసులు, ఆటో, కారు, 16 సాధారణ దొంగతనం కేసులు, 9 చైన్ స్నాచింగ్, 24 బైక్, ఏడు వైర్ దొంగతనం కేసులు, ఒక పిక్ పాకెటింగ్ తదితర కేసులను పోలీసులు ఛేదించారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తులో 981.93 గ్రాముల బంగారం, 501.36 గ్రాముల వెండి వస్తువులు, రూ.7,94,050 నగదు, 24 మోటారు సైకిళ్లు, ఆటో, కారు, 12 మొబైల్ ఫోన్లు, కెనాన్ కెమెరా, యాంప్లిఫైర్, కాపర్ తీగలు 135.9 కేజీలు, అల్యూమినియం తీగలు 20 కేజీలు, రిఫ్రిజిరేటర్, 32 అంగుళాల టీవీ, ఉషా మిక్సర్ ఉన్నట్లు సీపీ వివరించారు.

చాట్‌బోట్ ద్వారా సెల్‌ఫోన్ల రికవరీ

చాట్‌బోట్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదుల మేరకు జూన్‌లో రూ.41.25 లక్షల విలువైన సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. వీటితో కలిపి ఇప్పటివరకు రూ.4.17కోట్ల విలువ గల 2,784 సెల్‌ఫోన్లు రికవరీ చేసినట్లు వివరించారు. మొబైల్ ఫోన్ పోయిన వెంటనే 94906 17916 ఫోన్ నంబర్‌కు గానీ, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఐఎంఈఐ నంబర్, వివరాలు తెలియజేయాలని కోరారు. 2022లో 820 మొబైళ్లకు గాను 660, 2023లో 678 మొబైళ్లకు గాను 423 రికవరీ చేశామని చెప్పారు.

సమాచారం ఇవ్వండి

నగర ప్రజలు అత్యవసర సమయాల్లో దూర ప్రాంతాలకు కుటుంబంతో కలిసి వెళ్లినప్పుడు సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని సీపీ సూచించారు. అప్పుడు ఎల్‌హెచ్‌ఎంఎస్ సిస్టమ్ ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతీ ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. జూన్‌లో 338 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు 120 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు.

సిబ్బందికి అభినందనలు

కేసులు ఛేదించడంలో చాకచక్యంగా పనిచేసిన సీఐలు, ఎస్ఐలు. కానిస్టేబుళ్లు, హోంగార్డులను కమిషనర్ అభినందించారు. వారికి క్యాష్ అవార్డులు అందజేసి ప్రోత్సహించారు. సొత్తు పోగొట్టుకున్న బాధితులకు రికవరీ చేసిన సొత్తును సీపీ అందజేశారు. సమావేశంలో జేసీపీ కె.ఫకీరప్ప, క్రైం డీసీపీ కె.వెంకటరత్నం, క్రైం ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.